సంతల్లో సెల్‌ఫోన్ దొంగలు

- ఆందోళన చెందుతున్న కొనుగోలుదారులు
- చోరీకి గురవుతున్న విలువైన మొబైల్‌ఫోన్లు
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికుల విన్నపం


హౌసింగ్ బోర్డులోని కూరగాయల సంత

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని వారంతపు సంతలో సెల్‌ఫోన్ దొంగలు రెచ్చిపోతున్నారు. సెల్‌ఫోన్లను చోరీ చేసి క్షణాల్లో మటుమాయం చేస్తున్నారు. విలువైన మొబైల్‌ఫోన్లు చోరీకి గురవుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జహీరాబాద్ పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రతి సోమవారం, మాణిక్‌ప్రభు వీధిలో శుక్రవారం, దత్తగిరి కాలనీలో ప్రతి శనివారం, బుధవారం రంజోల్‌లో వారంతపు సంతలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లిన వారి జేబులో నుంచి సెల్‌ఫోన్లను అదును చూసి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా దొంగతనాలు అడ్డుకట్ట పడటంలేదు.

ప్రత్యేక నిఘా పెట్టాలని విన్నపం

- ప్రతి సంతకు ఐదారు ఫోన్లు చోరీ అవుతున్నాయి. షర్టు జేబులో పెట్టుకున్న ఫోన్లను దొంగలు కొట్టేస్తున్నారు. సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న వారిలో మహిళలు కూడా ఉన్నారని బాధితులు చెబుతున్నారు. ఫోన్లు చోరీ అయిన వెంటనే ఫోన్‌పే, గూగుల్ పే ల నుంచి డబ్బులు కాజేస్తున్నారని పలువురు వాపోతున్నారు. సెల్‌ఫోన్ చోరీలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి సంతలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

కొన్ని సంఘటనలు

- మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి గ్రామానికి చెందిన మల్‌శెట్టి పట్టణంలోని హౌసింగ్‌బోర్డు సంతలో కూరగాయలు కొనేందుకు వెళ్లాడు. కూరగాయలు కొనుగోలు చేస్తుండగా పైజేబులో ఉన్న సెల్‌ఫోన్ మాయమైంది. దీంతో ఫోన్ చోరీకి గురైందని తెలుసుకుని మరో ఫోన్‌తో వెంటనే కాల్ చేయగా స్విచ్‌ఆఫ్ అని వస్తుంది.
- ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న మోహన్ దత్తగిరి కాలనీలో సంతలో కూరగాయలు కొనేందుకు వచ్చాడు. కూరగాయలు కొంటున్న సమయంలో పైజేబులో ఉన్న ఫోన్‌ను దొంగలు మాయం చేశారు.
- ఇలా ప్రతి వారం ఎంతోమంది సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. విలువైన ఫోన్లు కొట్టేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంతలో పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి సెల్‌ఫోన్ల చోరీలను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



సెల్‌ఫోన్ చోరీలను అరికట్టడానికి గట్టి చర్యలు తీసుకుంటున్నాం. సంతల్లో మొబైల్ పోలీస్ టీంతో గస్తీ నిర్వహిస్తున్నాం. ఫిర్యాదులు వచ్చిన వాటిలో చాలావరకు రికవరీ చేశాం. కొత్తగా వచ్చిన యాప్ ద్వారా ట్రాప్ చేసి దొంగలను పట్టుకుంటున్నాం. ప్రజలు కూడా సంతకు వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

– సీహెచ్ రాజు, జహీరాబాద్ టౌన్ సీఐ

క్లుప్తంగా

ఓపెన్ జిమ్ ప్రారంభం


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి పట్టణంలోని 26వ వార్డు మగ్దూంనగర్‌లో కౌన్సిలర్ షేక్ సాబేర్ ఆధ్వర్యంలో ఓపెన్ జిమ్‌ను సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్


చెక్కు అందజేస్తున్న సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ అని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం హత్నూర మండలంలోని బ్రాహ్మణగుడ గ్రామానికి చెందిన బొట్ల మానేయ్యకు రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదలు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, వీరేందర్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

చక్కెర కర్మాగారాన్ని రక్షించుకుందాం

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతానికి గుండెకాయలాంటి ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని రక్షించుకుందామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, సామాజిక నేత ఢిల్లీ వసంత్ అన్నారు. ఆదివారం జహీరాబాద్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన జహీరాబాద్ పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. జహీరాబాద్ చక్కెర కర్మాగారాన్ని రైతులు నడిపించుకునే విధంగా పరిష్కార మార్గాన్ని సమావేశంలో వెల్లడించనున్నట్లు వివరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మాధవరెడ్డి, మహిపాల్‌యాదవ్, విశాల్‌గోడ్కె, అశోక్ పాటిల్, యాసిర్‌ఖాన్, రహీం, పాపన్న, శ్రీనివాస్, ఓంకార్, విష్ణు, స్టీవెన్ పాల్గొన్నారు.

సిద్ధివినాయక ఆలయంలో ఎర్రోళ్ల శ్రీనివాస్ పూజలు


ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు, నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో వెలసిన సిద్ధివినాయక ఆలయంలో టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమం, ఎస్‌ఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు, ప్రజాప్రతినిధులు నర్సింహారెడ్డి, గౌసొద్దీన్, చంద్రప్ప, శ్రీకాంత్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మల్‌రెడ్డి, అమీర్, గోపాల్ ఉన్నారు.

మురుగుకాలువలు నిర్మించాలని నిరసన


రోడ్డుపై అడ్డంగా వేసిన టైర్లు

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని శేఖాపూర్ గ్రామంలోని నాయీబ్రాహ్మణ కాలనీలో మురుగుకాలువలు నిర్మించాలని ఆదివారం ఆ గ్రామ ప్రజలు రోడ్డుకు అడ్డంగా టైర్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కాలనీలో మురుగు కాలువలు లేకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపై ప్రవహిస్తోందని వాపోయారు. దీంతో మురుగుకాలువలు నిర్మించాలని పలుమార్లు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సర్పంచ్ స్పందించి వెంటనే మురుగు కాలువలను నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

వర్షానికి కూలిన చెరువుకట్ట గోడ

మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తుల విన్నపం



జహీరాబాద్ టౌన్: మండలంలోని శేఖాపూర్ చిన్న చెరువుకట్ట గోడ శనివారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. గోడ కూలడంతో చెరువు కట్టకు గండి పడే ప్రమాదం ఉందని, దీంతో ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి కూలిన చెరువుకట్ట గోడకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొత్తగా తడ్కల్ మండలం ఏర్పాటు


సంబరాలు జరుపుకొంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కంగ్టి(నారాయణఖేడ్): నారాయణఖేడ్ నియోజకవర్గంలో కొత్తగా తడ్కల్ మండలం ఏర్పాటైందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తడ్కల్ కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం సోమవారం అధికారికంగా జీఓ జారీ చేయనున్నట్లు వెల్లడించారు. 14 గ్రామాలు, నాలుగు తండాలు కలిపి కొత్తగా తడ్కల్ మండలం అవతరించనుందని తెలిపారు. కొత్తగా మండలం ఏర్పాటు కోసం కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నించారని విరుచుకుపడ్డారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు టపాకులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. సీఎం సీకేఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత


సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

నారాయణఖేడ్: తమ సమస్యలు పరిష్కరించనిపక్షంలో సమ్మె చేపడతామని అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు నారాయణఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయడంతో పాటు ఉద్యోగభద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పిస్తూ పదవీవిరమణ సందర్భంగా రూ.10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని స్పష్టం చేశారు. నోటీసు అందజేసినవారిలో సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి, అంగన్‌వాడీ టీచర్ల సంఘం బాధ్యులు నాగేశ్వరి, వీణా కుమారి, శాంతాబాయి, స్వరూప, అనురాధ, నిర్మల, లక్ష్మి, పుణ్యవతి, శ్యామల, పద్మ, బాలమణి, యాదమ్మ తదితరులు ఉన్నారు.

వైభవంగా సంకష్టహర చతుర్థి

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో ఆదివారం సంకష్టహర చవితిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ పట్టణ శివార్లలోని శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో బుద్ధి, సిద్ధి వినాయకుడికి ఆలయ వ్యవస్థాపకులు మధు పంతులు ఆధ్వర్యంలో అభిషేకం, అలంకరణ, గణపతిహోమం నిర్వహించారు. పట్టణానికి చెందిన భక్తులు వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో వెలసిన సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా సమీపాన ఉన్న కర్నాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


నారాయణఖేడ్: ప్రత్యేక అలంకరణలో వినాయకుడు


న్యాల్‌కల్: హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధీరత్వానికి నిదర్శనం శివాజీ


శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: ధీరత్వానికి నిదర్శనం శివాజీ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కొనియాడారు. పటాన్‌చెరు మండలంలోని లక్డారం గ్రామంలో ఆదివారం శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా ముస్లింల శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భావితరాలకు మహనీయుల చరిత్రలను తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో నియోజకవర్గవ్యాప్తంగా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణమాణిక్‌రెడ్డి, ఎంపీటీసీ శైలజ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ముస్లిం మతపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని మల్లికార్జునహిల్స్, బ్యాంక్‌కాలనీ, వంధనపురి కాలనీలలో రూ.కోటి 20లక్షల సొంత నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని లయన్స్‌క్లబ్‌లో ఎంఎన్‌ఆర్ హాస్పిటల్ వైద్యులచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ జైపాల్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, శీనయ్య, పట్టణ పురప్రముఖులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

పటాచెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో గోశాల ఎదురుగా నిర్మించనున్న సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్, భవాని మాత దేవాలయాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం అధ్యక్షుడు రాథోడ్, గౌరవ అధ్యక్షుడు మోహన్‌సింగ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'సీఎం కేసీఆర్ పునరాలోచించాలి'

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వంపై సీఎం కేసీఆర్ పునరాలోచించాలని డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం పేర్కొన్నారు. ఆదివారం ఫసల్‌వాదిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం కోసం నలుగురు పోటీ పడుతున్నారని, ఆనలుగురిలో ఏ ఒక్కరికి ఇచ్చినా తాను పార్టీకి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కొండాపూర్ ఎంపీపీ మనోజ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రతిఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని టీఎస్ గవర్నమెంట్ కాలేజీ లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కళింగ కష్ణకుమార్ అన్నారు. ఆదివారం హరిదాస్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమ కోసం అంబేడ్కర్ ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాజ్యాంగాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో సామాజిక సేవ నాయకులు అడ్వకేట్ రామారావు, ప్రొఫెసర్ చిన్నసోమన్న, సర్పంచ్ షఫీ, మాజీ సర్పంచ్ నర్సింహులు, ఉపసర్పంచ్ కరణ్‌సింగ్, గోప్యానాయక్, చక్రనాయక్, ప్రశాంత్‌కుమార్, అంబేడ్కర్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు సన్మానం



జహీరాబాద్ టౌన్: నీట్‌లో సత్తాచాటి ఎంబీబీఎస్ సీట్లు సాధించిన గిరిజన విద్యార్థులను తెలంగాణ బంజార ఎంప్లాయీస్ సేవా సంఘం(టీబెస్) నాయకులు ఆదివారం సన్మానించారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని సాయి ప్రణీత్ చవాన్, మురళీధర్, విజయ్‌కుమార్, అరుణ్‌కుమార్, ఆదిత్య రాథోడ్‌కు నీట్‌లో మంచి ర్యాంక్‌లు వచ్చాయి. ఈ మేరకు పట్టణంలోని బంజార భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీబెస్ నాయకులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీబెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాంరాథోడ్, జిల్లా కార్యదర్శి అర్జున్, చవాన్, డివిజన్ అధ్యక్షుడు తుకారం, నాయకులు హన్మంత్ పవార్, డాక్టర్ సునిల్ కుమార్, జైసింగ్‌చవాన్, దేవిసింగ్ రాథోడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్పెషల్‌డ్రైవ్

నారాయణఖేడ్: ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి చేపట్టిన స్పెషల్ డ్రైవ్ నారాయణఖేడ్ మండలంలో ఆదివారం కొనసాగింది. అంత్వార్‌లోని 239వ నెంబరు పోలింగ్ కేంద్రంలో కొనసాగుతున్న ప్రక్రియను నారాయణఖేడ్ తహశీల్దార్ దేవిదాస్ సందర్శించి పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యాంరావు, సీనియర్ అసిస్టెంట్ రాజుపటేల్ ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన

హత్నూర(సంగారెడ్డి): ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో ఈవీఎంలను ప్రదర్శిస్తున్నట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. ఆదివారం హత్నూర మండల కేంద్రంతోపాటు దౌల్తాబాద్, మల్కాపూర్ గ్రామాల్లో ఈవీఎంల విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆర్ఐ శ్రీనివాస్, సర్పంచులు వీరస్వామిగౌడ్, వెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్, వార్డుసభ్యుడు ఆసిఫ్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

సార్వజనిక్ వినాయక ఉత్సవ కమిటీ ఎన్నిక

కోహీర్(జహీరాబాద్): ప్రసిద్ధి చెందిన కోహీర్ సార్వజనిక్ వినాయక మండలి 80వ వార్షికోత్సవ ఉత్సవ కమిటీ ఎన్నికలు ఆదివారం కోహీర్ పట్టణంలోని పాండురంగ మందిరంలో ఏకగ్రీవంగా జరిగాయి. కమిటీ అధ్యక్షుడిగా ఇర్మల్ సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బక్క ప్రవీన్‌కుమార్, బోయిని రాజ్‌కుమార్ ఎన్నికైయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చాకలి అనిల్‌కుమార్, కార్యదర్శులుగా సంగమేశ్వర్, ప్రకాష్‌కుమార్, అవుసలి నాగరాజు, కోశాధికారిగా గణేష్‌రెడ్డి, సహ కోశాధికారిగా భవానీరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. మంటప నిర్వాహకులుగా భవానీరెడ్డి, గజేందర్‌రెడ్డి, సలహాదారులుగా భవానీరెడ్డి, కిరణ్‌మాధవరెడ్డి, చరణ్‌గౌడ్, శ్రీధర్ ఆచారి, శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. సభ్యులుగా రాజు, మధుసూదన్‌రెడ్డి, రాఘవేందర్ దేశ్‌పాండే, జయపాల్‌రెడ్డి, నీలి రాజు, స్వరూపరెడ్డి, బస్వరాజ్, మహేష్‌కుమార్ ఎన్నికయ్యారు.

ఓటరుగా నమోదు చేసుకోండి


కిట్‌లు అందుకున్న బీఎల్‌ఓలతో తహసీల్దార్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంగ్రాంరెడ్డి, ఉప తహసీల్దార్ విశ్వేశ్వర్, నైబర్హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో సమావేశం

జిన్నారం(పటాన్‌చెరు): 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని గుమ్మడిదల తహశీల్దార్ గంగాభవాని తెలిపారు. గుమ్మడిదల గ్రామంలో ఆదివారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన కిట్‌లను బీఎల్‌ఓలకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

గొర్రెగట్టులో 2కే రన్


2కే రన్‌లో పాల్గొన్న చంటి రాహుల్‌కిరణ్

మునిపల్లి(అందోల్): 2కే రన్ పరుగును సౌత్ ఇండియా డిక్కి వైస్ ప్రెసిడెంట్ చంటి రాహుల్ కిరణ్, సంగారెడ్డి డీఎస్పీ రమేశ్ జెండా ఊపి ప్రారంభించారు. ఆదివారం మండలంలోని గొర్రెగట్టు గ్రామం నుంచి బుదేరా చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించారు. అంతకుముందు బీఆర్‌ఎస్ నాయకులు చంటి రాహుల్ కిరణ్‌ను సన్మానించారు. అనంతరం 2కే రన్‌లో మునిపల్లి దోస్తానా ప్రదీప్, పవన్ టీమ్ గెలుపొందగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు అనంద్‌రావు, యువనాయకులు అరుణ్, కార్తీక్, మండల సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి అప్సర్, భానుతేజ, హోప్ న్యూరో హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్ హాజీ, ఇమ్రాన్, అఫ్సాన్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా పోరాడాలి


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు

రాయికోడ్(అందోల్): ముదిరాజ్‌లు ఐక్యంగా ఉంటూ తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని నాగ్వార్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మండల ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వేషన్‌లో బీసీ (డీ)కేటగిరిలో ఉన్న ముదిరాజ్ కులాన్ని బీసీ(ఏ) కేటగిరిలో చేర్చాలని డిమాండ్ చేశారు. మండల ముదిరాజ్‌ల భవనం కోసం రెండెకరాల స్థలాన్ని కేటాయించాలన్నారు. అంతకుముందు అల్లాదుర్గం–మెటల్‌కుంట ప్రధాన రహదారిపై బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రణయ్, రాజు, గోపాల్, జగన్, అంజన్న, బక్కప్ప, నర్సింలు, దుర్గయ్య, విఠల్, హన్మంతు, మాణిక్, బస్వరాజ్, నర్సింలు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం పాదయాత్ర


పాదయాత్ర ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

జహీరాబాద్ టౌన్: లోక కల్యాణార్థం జహీరాబాద్ వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం బడంపేట రాచన్న దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రను డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ శివకుమార్ ప్రారంభించారు. పాదయాత్ర పట్టణంలోని రాంనగర్, శేకాపూర్, పర్సపల్లి మీదుగా పుణ్యక్షేత్రమైన బడంపేట వరకు కొనసాగింది. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, సుభాష్, సభ్యులు శివరాజ్, అరుణ్, బండి శ్రీనివాస్, బాబుపాటిల్, సుధాకీర్తి పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు

రాయికోడ్(అందోల్): రాయికోడ్ మండలంలోని జంబిగి (కే) గ్రామంలో పండరీపూర్ అంబదాస్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆంగరంగ వైభవంగా రుక్మిణీ పాండురంగ విఠలేశ్వర విగ్రహాల ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా అంబదాస్ మహారాజ్ మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ ఉదయం 9.30 గంటలకు రుక్మిణి పాండురంగ విఠలేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.


బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు